భోగి భాగ్యాలు

ఘనంగా భోగి పండుగ

జిల్లాలో భోగి వేడుకలను యువత, మహిళలు, చిన్నారులు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారు జాము నుంచే పట్టణం, గ్రామాల్లోని వీధి వీధిన భోగి మంటలు వేసి, మంచు తెరలను కరిగించి కేరింతలు కొట్టారు. ఈ శుభవేళ ఆనందాల భోగి భోగభాగ్యాలతో పాటు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని పలువురు ఆకాంక్షించారు.

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలోని జగన్నాథపురం, సత్యనారాయణపురం, మందపాడు, బేతవోలు, మండలంలోని బిళ్లపాడు, రామనపూడి, తటివర్రు, మల్లాయపాలెం, చౌటపల్లి, లింగవరం, వలివర్తిపాడు, దొండపాడు, మోటూరు తదితర గ్రామాల్లో, గుడ్లవల్లేరు మండలంలోని గుడ్లవల్లేరు, డోకిపర్రు, విన్నకోట తదితర గ్రామాల్లోని వీధి వీధిన యువత, చిన్నారులు, మహిళలు తెల్లవారు జాము నుంచే భోగి మంటలు వేసి ఆ మంటల్లోనే నీళ్లు కాసుకుని తలంటు స్నానాలు చేసి, ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.


గుడివాడ సత్యనారాయణపురంలో భోగి మంటలు వేసిన యువత


గుడివాడలో భోగి మంటల వద్ద యువత, చిన్నారులు

ప్రత్యేక పూజలు



మండవల్లి: సంక్రాంతి ముందు రోజు వచ్చే భోగి పండుగను గ్రామస్తులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం భోగి మంటలు వేశారు. ఏడాది పొడవునా తమకు మంచి జరగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడివాడలో..



గుడివాడ టౌన్: సంక్రాంతి సంబరాలు పట్టణంలో సోమవారం ఆనందోత్సాహాలతో ప్రారంభమయ్యాయి. వేకువ జామునే యువత భోగి మంటలతో సంబరాలు ప్రారంభమయ్యాయి. చిన్నారులకు భోగిపళ్లు, పరస్పరం పిండివంటల పంపిణీలు, కోడి పందేలతో సంబరాలు సాగాయి.

కైకలూరులో..

కైకలూరు: భోగి పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు కూడళ్లలో భోగి మంటలు వేశారు. సంతమార్కెట్ సమీపంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కుటుంబ సమేతంగా భోగి మంటలు వేసి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులతో కటుంబాలు కళకళలాడాయి. పలుచోట్ల చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు.


కైకలూరులో భోగి మంటలు వెలిగించిన డీఎన్నార్

పామర్రులో..


పామర్రు మండలంలోని దగ్గుమిల్లిలో భోగిమంట

పామర్రు: భోగి పండుగను సోమవారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి మంటలు వేశారు. ఇళ్లల్లో ఉన్న పాత సామగ్రిని తెచ్చి మంటల్లో వేశారు. ఆ మంటలలో నీళ్లను కాచుకుని స్నానాలు చేశారు.

గుడ్లవల్లేరులో..


గుడ్లవల్లేరు సత్యదేవుని సన్నిధిలో భోగి మంట వేస్తున్న యువకులు

గుడ్లవల్లేరు: మండలంలో వాడవాడలా చిన్నా.. పెద్దా తారతమ్యం లేకుండా భోగి మంటలను వేసి సోమవారం వేకువజామునే సందడి చేశారు. యువకులు, చిన్నారులు పనికి రాని వస్తువుల్ని మంటల్లో వేసి, తమ జీవితాల్లో కొత్త కాంతుల కోసం పెద్ద పండగ సంక్రాంతిని ఆహ్వానించారు.

క్లుప్తంగా

చిన్నారులకు ఆటల పోటీలు



గుడివాడ టౌన్: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక వాంబే కాలనీలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో లెమన్ అండ్ స్పూన్, రంగవల్లులు, పరుగు పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఐద్వా కార్యదర్శి పి. రజిని, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆర్.కొండ, నాయకులు ఎం.నారాయణ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

భోగిమంటల్లో కరెంట్ బిల్లులు వేసి నిరసన



గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్‌చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు మాట తప్పిందని సీపీఎం నాయకులు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో కరెంట్ బిల్లులను సోమవారం భోగిమంటల్లో వేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని, పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేస్తూ కూటమి ప్రభుత్వానికి నిరసన తెలిపామన్నారు. సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి ఆర్ సీపీ రెడ్డి, ఆర్. కొండ, ఆర్. నారాయణ, నాంచారమ్మ, బి. నాగరాజు, సీహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో మార్పులకు వ్యతిరేకంగా నిరసన



గుడ్లవల్లేరు: ఇంటర్ విద్యలో మార్పులు వద్దని వ్యతిరేకిస్తూ భోగి మంటల్లో సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదిక్ బాబు ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభిప్రాయ సేకరణ పత్రాలను వేసి కాల్చారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యలో మార్పులు చేయకుండా విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పార్థు, మూమీనా, నేహా హజ్మన్ పాల్గొన్నారు.

పోటీలు నిర్వహించడం అభినందనీయం



తోట్లవల్లూరు: సంక్రాంతి సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించటం అభినందనీయమని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గరికపర్రులో బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బీవీఆర్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ అర్జునరాజు విజేతలకు బహుమతులను అందజేశారు. నాయకులు నడకుదురు రాజేంద్ర, గోపాలకృష్ణమూర్తి, కృష్ణారావు, బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో మహాకుంభాభిషేకం


దత్తాశ్రమంలో సచ్చిదానంద స్వామితో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ లోకుమూడి గరువు దత్తాశ్రమం వద్ద పుష్కరకాల మహాకుంభాభిషేకాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం దత్తనాథ రాగసాగరంలో భాగంగా నాద చికిత్స కచేరీ ఆకట్టుకుంది. భక్తులకు పలు ఆధ్యాత్మిక విషయాలను ప్రబోధించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, ఎంపీపీ అడవి కృష్ణ సచ్చిదానంద స్వామిజీ నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో దత్తాశ్రమ నిర్వాహకులు గురజాడ ఉదయశంకర్, బెల్లింపల్లి కృష్ణారావు, ఎస్‌వీఎస్ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పక్షుల కిలకిలరావాలు

గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆటపాక పక్షుల విహార కేంద్రాన్ని సందర్శించారు. ఎస్‌వీఎస్ సూర్యనారాయణరాజు బోటులో స్వామిజీని తీసుకువెళ్లి పక్షుల విశేషాలను వివరించారు. పక్షుల కిలకిలరావాలు ఎంతో ఆకట్టుకున్నాయని, మరో పర్యాయం ఇక్కడకు వస్తానని స్వామిజీ చెప్పారు. గురజాడ ఉదయశంకర్, పట్టణ సీఐ పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బరులను పంచుకున్న కూటమి నేతలు


లోకుమూడి గ్రామంలో కోడి పందేలు

కైకలూరు: సంక్రాంతి కోడి పందేల విషయంలో చివరకు ప్రజాప్రతినిధులదే పైచేయిగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మొదటి ఏడాది సంక్రాంతి కావడంతో టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయంతో బరులను పంచుకున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చావలిపాడు బరి వద్దకు వచ్చి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో కోడిపందేలు జరిగాయి. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. కోడి పందేలను తిలకించడానికి మహిళలు సైతం భారీగా తరలి వచ్చారు. ఈ సారి పలు బరుల వద్దకు హిజ్రాలు వచ్చి డబ్బులు ఇవ్వాలని నిర్వాహకులను అడిగారు. గత ఏడాదితో పోల్చుకుంటే పేకాట శిబిరాలు పెరిగాయని నిర్వాహకులే చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పామర్రు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిలో స్థానిక జాలయ్య మిల్లు దగ్గర ఫ్లై ఓవర్ వద్ద సోమవారం ఓ కారు అదుపు తప్పి ఫ్లై ఓవర్ గోడను ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఒక మహిళ, ఇద్దరు పురుషులకు గాయాలయ్యాయి. వీరు మచిలీపట్నానికి చెందిన వారిగా గుర్తించారు.

జోరుగా కోడిపందేలు


వలివర్తిపాడు వద్ద కోడి పందేల బరి

తోట్లవల్లూరు: మండలంలో కోడిపందేలు జోరుగా ప్రారంభమయ్యాయి. మండలంలోని గరికపర్రు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, కుమ్మమూరు గ్రామాల్లో సోమవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో కోడిపందేల బరులు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి కోడిపందేలు తిలకించేందుకు పందెంరాయుళ్లు, జూదప్రియులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో సోమవారం జోరుగా కోడి పందేలు నిర్వహించారు. పోలీసులు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుని అడ్డుకున్నా అధికార పార్టీ నాయకులను నిలువరించలేకపోయారు. గుడివాడ మండలంలోని వలివర్తిపాడు పరిధిలో ఏర్పాటు చేసిన బరిలో కోడిపందేలు, పేకాట విచ్చలవిడిగా సాగాయి. బరులను అడ్డుకుని హడావుడి చేసిన అధికారులు మిన్నకుండిపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


వల్లూరుపాలెంలో కోడి పందేలు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పామర్రులో..

పామర్రు: పామర్రు మండలంలోని కొత్త పెదమద్దాలిలో జాతీయ రహదారి పక్కన కోడి పందేల శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ రెండు రకాల బరులను ఏర్పాటు చేశారు. ఒకటి రూ.50 వేల పైబడి పందేల బరి కాగా మరొకటి రూ.50వేల లోపు పందేలు బరి.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో భోగి పండుగ నుంచే పల్లెల్లో పందెం కోళ్లు కాలు దువ్వాయి. సోమవారం నుంచి కనుమ వరకు ఈ బరులను నిర్వహించనున్నారు. కోడి పందేలతో పాటు పేకాట, గుండు ఆట, కోత ముక్క తదితర అన్ని రకాల జూదాలను ఈ బరుల్లో నిర్వహిస్తున్నారు.


గుడ్లవల్లేరు మండలంలో కాలు దువ్విన పందెం కోళ్లు


పామర్రు శిబిరంలో కలబడుతున్న పందెం కోళ్లు

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం


జమీదగ్గుమిల్లిలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం


నిమ్మకూరులో వెంకటేశ్వరస్వామి కల్యాణం

పామర్రు: పలు వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి, రంగనాథస్వామి శాంతి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలో సీతారామాంజనేయస్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం నిర్వహించారు. భక్తులు కాకర్ల సీతారామాంజనేయదాసు చంద్రావతి, కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు ధనలక్ష్మీ, రామచంద్రర్ హరిత , కె వీర వెంకటనాగరాజు శ్రీనందిని, కె వెంకటరమణ దంపతులు కల్యాణాన్ని జరిపించారు. నిమ్మకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి వెంకటేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. పామర్రు విష్ణాలయంలో గోదాదేవి కల్యాణం జరిగింది.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో గోదా జగన్నాథుని కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం

కైకలూరులో..

కైకలూరు: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా భోగి రోజున వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న) ఆలయంలో గోదాదేవీ కల్యాణం వైభవోపేతంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో గోదాదేవి కల్యాణం

ముగిసిన నగర సంకీర్తన

మండవల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమం సోమవారం ముగిసింది. కార్యక్రమంలో చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, వెంకయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ.. సమయం ఆదా

మండవల్లి: అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో మినుము పంటకు సోమవారం గ్రోత్ ప్రమోటర్ ద్వారా ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రావణాలను స్ప్రే చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ ఉపయోగించి ఈ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ డ్రోన్‌తో పిచికారీ చేయడం ద్వారా రైతుల సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నాగవిజయ, సుధాకర్, నాగవాణి, జగన్, షకీల్ పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

తోట్లవల్లూరు: బాల్య మిత్రులంతా ఒకే చోట కలిసిన అపూర్వ ఘటన మండలంలోని యాకమూరులో జరిగింది. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన గణేష్ యూత్ ఆధ్వర్యంలో 38 ఏళ్ల తరువాత బాల్య స్నేహితులంతా కలుసుకున్నారు. స్థానిక కోదండ రామాలయ అభివృద్ధికి ఫిక్సిటీ టెక్నాలజీస్ గ్రూపు కంపెనీస్ అధినేత వెలివెల వినయ్‌కుమార్ రూ. 3 లక్షల విరాళం ప్రకటించారు. అలాగే తమ కంపెనీల్లో ఇంజినీరింగ్ చదువుకున్న యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చిన వినయ్‌కుమార్‌ను స్నేహితులు స త్కరించారు. బాల్య మిత్రులు సుధీర్, రాజేష్, సుబ్రహ్మణ్యం, నాగేంద్రరావు, కిరణ్, నరసింహారావు, చిన్ని, శరత్, గోపి, సుబ్బారావు పాల్గొన్నారు.


వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బాల్య స్నేహితులు


గుడ్లవల్లేరులో చెరుకులు కొనుక్కెళ్తున్న దంపతులు


సింగలూరులో మహిళల రంగవల్లుల సందడి

పండుగ సందడి

గుడ్లవల్లేరు మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద పండుగ సందడి కనిపించింది. హరిలో రంగ హరి అంటూ హరిదాసులు, రంగవల్లుల్లో గొబ్బిళ్లను పెడుతున్న మహిళలు, గాలి పటాలు ఎగురవేయడంలో చిన్నారులు బిజీ అయ్యారు. పొంగళ్లు పొంగిస్తున్న యువతులు, గోదాదేవి కల్యాణాలు, భోగి మంటల వెలుగులు కనిపించాయి.

– గుడ్లవల్లేరు


పొంగలి పొంగిస్తున్న యువతులు